



## డ్రగ్గోపాఖ్యానమ్ !

విమానం చూడటానికి బాగానే ఉంటుంది. ఎక్కి కూచుని ప్రయాణం చేయాలంటే నాకు తగని భయం. నేలమీంచి లేవగానే గుండె బరువెక్కుతుందనీ, ఆ స్పీడుకి బరువెక్కిన గుండె ఆగిపోతుందని భయాలు పెట్టుకోవడం మూలంగా అవకాశ మొచ్చినా విమానం ఎక్కలేదు నేను. ముందు ముందు ఫారిన్ ఛాన్సు తగిల్తే ఎట్లాగా అని యిప్పట్నుంచే దిగులు పడుతున్నాను. అమెరికాకు, జపాన్‌కి ఇండియా నుండి రోడ్డు పడితే బావుండిపోను. బస్సో, కారో ఎక్కి నెలకో రెండు నెలలకో చేరుకోవచ్చు. మొన్నామధ్య మదరాసు నుంచి హైదరాబాద్‌కి విమానమ్మీద వెళ్ళమని నిర్మాత అన్నారు. నా వల్లకాదని నా భయాలు సిగ్గువిడిచి చెప్పేను. ట్రాంక్విలైజరు యిస్తాను. వేసుకుని విమాన మెక్కండని సలహా ఇచ్చారు. విమానం

ఎక్కడం కంటే ట్రాంక్విలైజరు వేసుకోవడానికి మరింత బెదిరి పోయేను. ఇంకో రోజు సెలవు టెలిగ్రాం ద్వారా పొడిగించి పైకెక్కి వచ్చాను.

నా దృష్టిలో ట్రాంక్విలైజరు బహు ప్రమాదమయిన డ్రగ్గు. నా దసలే పిరికి మైండు. ఏదయినా అలవాటు చేసుకున్నానూ అంటే చప్పున అంటించు కుంటాను. ఇప్పటికున్న అలవాట్లతోనే కిందా మీదా పడుతున్నాను. నా బతుక్కి ఆ అలంకారాలు చాలు. కొత్త వాటికి చోటులేదింక. వైద్య శాస్త్రానికి చేతులెత్తి నమస్కరించాలి. వైద్యంలో నారాయణుడున్నాడంటారు. వుండే వుండాలి. లేకపోతే ప్రపంచంలో రోగులంతా దేవుడా మా కెవరు దిక్కని కేకలు పెడుతూ కన్ను మూయాల్సిందే తప్ప మరో మార్గం వుండేది కాదు. మరణించే మనిషిని బతికించడం దేవుడి పని. రోగ తీవ్రతకి మనిషి కృంగి, కృశించి పోతుంటే కన్నతల్లిలా బాధనీ, భయాన్ని తీర్చే ఏకైక సాధనం, వైద్య శాస్త్రం. ఎన్నెన్నో మందులూ అనేక రకాల వైద్యాలు కనిపెట్టి ప్రపంచ రోగుల్లారా భయపడకండంటూ అభయ హస్తమిచ్చే వైద్య శాస్త్రాన్ని తీసిపారేస్తే కళ్ళు పోతాయని స్వాభిప్రాయం.

ఏక్సిడెంట్‌లో కాలికో, చెయ్యికో దెబ్బ తగులుతుంది. మొత్తం శరీరమే పచ్చడవ్వొచ్చు. గాయాలు తగ్గేందుకు మందులేస్తారు. కట్లు కడతారు. కాని అవి నయమయ్యేంత వరకూ మనిషి నిబ్బరంగా బతకలేడు. కొలిమిలో కాల్చి లక్ష సుత్తుల్తో చెడామడా వాయించే నరకం మనిషి అనుభవించలేడు. నిద్రపడితే కొంతలో కొంత బాధ మరిచిపోవచ్చు. కాని నిద్రపట్టదు. అదుగో అల్లాంటప్పుడు నిద్ర మాత్రలూ రకరకాల ట్రాంక్విలైజర్లూ ఆ రోగిని ఆదుకుంటాయి. డ్రగ్గు మింగగానే జోకొడతాయి. కొంత సుఖాన్నిస్తాయి. నిద్ర వస్తుంది. బాధ తీవ్రత తగ్గుతుంది.

రోగుల్ని ఆదుకునే ఈ డ్రగ్గులను రోగులకంటే ఏ రోగం లేనివాళ్ళే ఎక్కువ వాడుతున్నట్లు లెక్కలవల్ల తెలిసింది. బ్రాందీ, విస్కీలు సేవించడం పాత పద్ధతి. పవర్‌ఫుల్ ట్రాంక్విలైజర్లూ ఆ బాపతు డ్రగ్గులు పుచ్చు

కుని తాగుతూ, ఉయ్యాలెక్కినట్లు ఊగుతూ ఆనందం అనుభవించడం నేటి సివిలిజేషను. స్టేటస్‌కి సింబల్. దేశదేశాలలో ఈ వ్యాపారం ముమ్మరంగా జరుగుతోంది. ఇంజక్షన్లూ, మాత్రల రూపాలలో దొరుకుతున్నాయి. డ్రగ్గు పుచ్చుకుని పరీక్షలు రాస్తున్నారు. కవిత్వాలు రాస్తున్నారు. సంసారాలు చేస్తున్నారు. ఎన్నో సినిమాలలో ఈ భాగోతం చూసేము. గుంపులు గుంపులుగా కుర్రకారంతా ఆడా, మగా విచక్షణ లేకుండా డ్రగ్గులు పుచ్చుకుని గంతులు వేస్తారు. హరేరామ అంటే హరేకృష్ణ అంటారు, రాముడూ కృష్ణుడూ డ్రగ్గులోనే వాళ్ళకగుపిస్తారు. డ్రగ్గు పరమాత్మకి దగ్గర చుట్టమని కనుక్కున్నారు. దారి ఏదయితేనేమి, భక్తి భావం పేట్రేగి పోతున్నందుకు మనం సంతోషించాలి.

భక్తిని పెంపొందించడమే కాదు, భయాల్ని కూడా దూరం చేస్తుంది డ్రగ్గు. లక్షలక్షలు కాకి ఎత్తుకు పోయినట్లుపోగా వ్యాపారం మూతపడితే ఆ శాల్తీని ఆదుకునేందుకు ఫస్టు క్లాసుగా పని చేస్తుంది. నువ్వే నేనని కవిత్వం చెప్పిన ప్రేమికుడు మరో ఆడదాన్ని పెళ్ళి చేసుకున్నప్పుడు ఆ ప్రియురాలికి డ్రగ్గే ప్రియుడు. పెళ్ళయిన ఏడాదిలోనే పెళ్ళాం లేచిపోతే ఆ భర్తకి డ్రగ్గే శ్రీరామరక్ష. అప్పులెక్కువైనప్పుడూ, పిల్ల పెళ్ళికెదిగి పదేళ్ళయినా సంబంధాలు కుదరనప్పుడు, భీపొమ్మని సర్వప్రపంచం తిడుతున్నప్పుడూ డ్రగ్గు ఓదార్చుతుంది. బతుకుమీద విరక్తి కలిగి బతుక్కి తెర దించుకోవాలనుకున్నా డ్రగ్గు అందుకు నేనున్నానంటుంది. చూస్తూ చూస్తూ కిరసనాయిలు మీద పోసుకుని అంటించుకోలేం. దిగుడు బావిలో దూకలేం. ఉరి వేసుకోలేం. కత్తితో పొడుచుకోలేం. డోసు మించి మాత్రలు మింగి సుఖంగా కళ్ళు మూసుకుంటే చాలు. మరింక కళ్ళు తెరిచేపనే వుండదు. కస్తీ డ్రగ్గుల గురించి అడక్కండి. అవి మనిషిని చంపవూ, బతికించవు.

ఉద్రేకం, కొత్త ఉత్సాహం కావాలనుకున్నప్పుడు కొందరు మహాశయులు డ్రగ్గు వాడకం... డ్రగ్గు పడిం దగ్గర్నుంచి ఒకటే ఉత్సాహం, ఒకటే ఉద్రేకం మందు పని చేసినంత సేపూ తిమ్మిరిగా ఊపుగా

బాగానే వుంటుంది. అరమోడ్పు కళ్ళతో పిచ్చి మొహాలతో కేరింతలూ నవ్వులతో కళకళ లాడుతూనే ఉంటారు. మందు ప్రభావం తగ్గిపోతే గాలి తీసిన టైర్లలాగా నేలకి అతుక్కుపోతారు.

ఈ పిచ్చి మందులు బాగా అలవాటయితే ఆ గురుడి అవస్థ వర్ణనాతీతం. మందు పడకపోతే తనకై తాను మంచినీళ్ళు సైతం తాగలేడు! నాడీ మండలం యావత్తూ చచ్చుపడి పోవడం వల్ల అస్తమానం చేతులు వణుకుతాయి. జీర్ణకోశం దెబ్బతిని అజీర్తి తగులుకుంటుంది. ఆకలుండదు, దాహముండదు నువ్వులేనిదే. అని పాటలు పాడుకోవాలి. జ్ఞాపక శక్తి పూర్తిగా ధ్వంసమైపోతుంది. ఇల్లెక్కడో, ఇల్లాలెవరో తేలీదు. "బాబూ మా యింటికి దారి చూపించి పుణ్యం కట్టుకోం"డనే బోర్డు వీపు మీద కట్టుకోవాలి. అందుబాటులో మందు లేకపోతే చిరాకూ కోపం వచ్చేస్తాయి. ఉన్నట్లుండి ఘొల్లు నవ్వేస్తారు. ఆనక భయంకరంగా ఏడుస్తారు. మందు తెచ్చుకునేందుకు ఎంతకయినా తెగిస్తారు. దొంగతనం అవసరమనుకుంటే హత్యలుకూడా చేస్తారని చరిత్ర చెబుతోంది.

విమానం ఎక్కి ముచ్చట తీర్చుకోవాలని నా సదుద్దేశం. గాలి కొట్టుకు పోయినా ఫర్లేదు. అందుకోసం డ్రగ్గు పుచ్చుకోవడం ప్రారంభించానంటే అడ్రసు దొరకకుండా అన్యాయమై పోతానని నాకు తెలుసు. తప్పని సరై ప్రాణాలకు తెగించైనా విమానం ఎక్కుతానుగాని డ్రగ్గు జన్మలో పుచ్చుకోనని మొన్ననే మదరాసులో ఒట్టేసుకున్నాను.